సాక్షి
కాకినాడ

గురువారం । 20 । జూన్ । 2024



వైభవంగా శ్రీవారి చక్రస్నానం

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం వైనతేయ గోదావరి నదిలో శ్రీవారి చక్ర స్నానం వైభవంగా జరిగింది.


8లో



సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వెంకటేశ్వరప్రసాద్, జ్యోతిశ్రీ దంపతులు (కాకినాడ) రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు.

డెల్టాకు 7,845 క్యూసెక్కులు



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 7,845 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,180, మధ్య డెల్టాకు 1,565, పశ్చిమ డెల్టాకు 4,100 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 8.85 నీటిమట్టం అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

600 పాఠశాలల్లో ఆడిట్

అమలాపురం టౌన్: జిల్లాలోని 600 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మంగళ, బుధవారాల్లో ఆడిట్ పూర్తయిందని సమగ్ర శిక్షా ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ అధికారి (ఎఫ్ఏవో) జి.ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. అమలాపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కోనసీమకు చెందిన 385 పాఠశాలల్లో బుధవారం ఆడిట్ నిర్వహించారు. జిల్లాలో మంగళవారం 215 పాఠశాలల్లో ఆడిట్ జరిగితే బుధవారం మరో 385 పాఠశాలల్లో ఆడిట్ చేసినట్టు ఎఫ్ఏఓ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పాఠశాలల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ చేపట్టినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ జీసీ రెడ్డి అండ్ అసోసియేట్స్ నుంచి వచ్చిన ఆడిటర్లు బి.పవన్ కళ్యాణ్, ఎన్.టైటస్, బి.శివ రమేష్ పాఠశాలల ఆడిట్ నిర్వహిస్తున్నారు. అమలాపురంలో జరిగిన ఆడిట్‌ను డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశరావు, ఎఫ్ఏవో ప్రవీణ్ కుమార్, ఏఎంవో పిల్లి రాంబాబు పర్యవేక్షించారు. అమలాపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కోనసీమలోని అమలాపురం, అయినవిల్లి, అల్లవరం, ఉప్పలగుప్తం, అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి మండలాలకు చెందిన పాఠశాలల్లో ఆడిట్లు చేశామని తెలిపారు. మంగళవారం ఆలమూరు, రామచంద్రపురం, మండపేట, కె.గంగవరం, కపిలేశ్వరపురం, కొత్తపేట, రావులపాలెం మండలాల్లోని పాఠశాలల్లో ఆడిట్ పూర్తి చేశామన్నారు. ఆడిట్ నివేదికలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎఫ్ఏవో ప్రవీణ్‌కుమార్ అందజేశారు. అమలాపురంలో జరిగిన ఆడిట్‌లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి.విజయకుమారి, అకౌంటెంట్ పి.వరలక్ష్మితో పాటు కోనసీమలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

పాత అలైన్‌మెంట్‌తోనే బైపాస్ నిర్మించాలి



పాశర్లపూడిలో ధర్నా చేస్తున్న ఎన్‌హెచ్ బాధితులు

మామిడికుదురు: పాశర్లపూడి 216వ నెంబర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణం పాత అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మించాలని కోరుతూ స్థానికులు బుధవారం ధర్నా చేశారు. 2014లో చేసిన అలైన్‌మెంట్‌ను కాదని 2016లో చేసిన అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు పనులు చేస్తున్నారంటూ పనులను అడ్డుకున్నారు. కొంత మందికి అనుకూలంగా నిరుపేదలకు వ్యతిరేకంగా అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్పుల వల్ల ఆరు, పది సెంట్లు ఉన్న తమ భూములు కోల్పోతున్నామంటూ ఆవేదన చెందారు. ఈ సమస్యపై స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అర్జీ పంపించామని బాధితులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, రైల్వే రెవెన్యూ అధికారులకు తమ సమస్యను విన్నవించినా వారు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రపతి ఈ సమస్యపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ ధర్నాలో బాధితులు విప్పర్తి గణపతిరావు, గెడ్డం గంగాధర్, కుసుమ సుగుణ, చెల్లింగి ధర్మరాజు, గెడ్డం సావిత్రమ్మ, యల్లమెల్లి వెంకాయమ్మ, మల్లవరపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదనపు పొగాకుకు అపరాధ రుసుం ఎత్తివేయాలి

కొరిటిపాడు(గుంటూరు): అదనపు పొగాకు పంటపై అపరాధ రుసుం ఎత్తివేయాలని కోరుతూ ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులు బుధవారం గుంటూరు జీటీ రోడ్‌లోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు మాట్లాడుతూ అదనంగా పండించిన పొగాకు పంటకు అపరాధ రుసుం లేకుండా అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాలకు ఒక కమ్యూనిటీ హాలు నిర్మించాలని సూచించారు. స్పందించిన పొగాకు బోర్డు చైర్మన్, ఈడీలు చిడిపోతు యశ్వంత్‌కుమార్, అద్దంకి శ్రీధర్‌బాబులు మాట్లాడుతూ అపరాధ రుసుంపై ఇప్పటికే ఢిల్లీ లోని వాణిజ్య శాఖకు సిఫార్సు చేయడం జరిగిందని వెల్లడించారు. అనంతరం ప్రస్తుతం జరుగుతున్న వేలం విధానంపై చర్చించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల నాయకులు సత్రం వెంకట్రావు, వీవీఎస్ ప్రకాశరావు, అట్లూరి సతీష్, గూడూరి నాగరాజు, పెండ్యాల ప్రసాద్, పరిమి రాంబాబు, కరాటం రెడ్డిబాబు, కూచిపూడి రమేష్, కాకర్ల వివేకానంద, అడపా సత్యనారాయణ, ఇల్లూరి రాంబాబు, గద్దె శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్ తదితరులున్నారు.

చెక్కనైన పనితేరు

- రథాలు, దేవతామూర్తుల తయారీలో సిద్ధహస్తులు కొల్లాటి వంశస్తులు
- ఇప్పటి వరకు 82 రథాలను రూపొందించి మన్ననలు పొందిన వైనం
- సత్యదేవునికి రెండు రథాలు అందించిన కామేశ్వరరావు, శ్రీనివాస్ బృందం



అష్టగణపతుల బొమ్మలతో ఆలయానికి తలుపులు

అన్నవరం: 'శిలలపై శిల్పాలు చెక్కినారు..మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారు...' అంటూ హంపి విజయనగరంలో గల శిల్పకళ అందాల గురించి వర్ణించే సినిమా పాట ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అయితే ఈ శిల్పుల పనితనం చూస్తే చెక్కతో రథాలు చేసినారు...వారు దేవతామూర్తులకే కొత్త సొబగులు అద్దినారు' అని పాడాల్సి వస్తుంది. శిల్పకళను తలదన్నేలా చెక్కపై కూడా అందమైన శిల్పాలు, దేవతామూర్తులు, దేవుళ్లను చెక్కే శిల్పులతో బాటు, దేవతామూర్తులను ఊరేగించే ఎత్తయిన రథాలను రూపొందించే శిల్పులు కూడా ఉన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమండకు చెందిన శ్రీ మాణిక్యాంబ శిల్పకళా వుడ్ వర్క్స్ అధినేతలు కొల్లాటి కామేశ్వరరావు, కొల్లాటి శ్రీనివాస్ ఆ కోవకు చెందినవారే. పది అడుగుల ఎత్తు కలిగిన చిన్నరథంతో బాటు 36 అడుగుల ఎత్తయిన రథాలు కూడా నిర్మించిన చరిత్ర వారిది. వీటితోబాటు ఇంకా దేవతామూర్తుల విగ్రహాలు, వస్తువులు, కళాఖండాలు కూడా తయారు చేసి అందరితో శభాష్ అని పించుకున్న పనితనం వీరిది.

కులానికి అగ్నికుల క్షత్రియులు... వృత్తికి శిల్పకారులు

అలాగని వారేమి అనాదిగా చెక్కతో వస్తువులు, బొమ్మలు, గృహోపకరణాలు తయారు చేసే కులవృత్తి కలిగిన వడ్రంగులో, విశ్వబ్రాహ్మణులో కాదు. కులానికి సముద్రంలో చేపలు పట్టే అగ్నికుల క్షత్రియులు. అయితే గత నాలుగు తరాలుగా దేవతా విగ్రహాలు, రథాలు , ఇతర కళాఖండాలు తయారు చేయడాన్ని వృత్తిగా స్వీకరించినట్టు కొల్లాటి కామేశ్వరరావు, ఆయన కుమారుడు శ్రీనివాస్ తెలిపారు. సుమారు ఎనిమిది నెలల నుంచి వారు అన్నవరంలోనే ఉండి సత్యదేవుని ఊరేగించేందుకు 14 అడుగుల ఎత్తయిన చిన్న రథం, 34 అడుగుల పెద్ద రథం తయారు చేశారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి తమ అనుభవాలను వివరించారు.

రథాల తయారీ చాలా కష్టం



దేవుళ్లను ఊరేగించే రథాలు తయారు చేయడం చాలా కష్టమైన పని. అందులో 20 అడుగుల కన్నా ఎత్తు రథం తయారు చేయాలంటే చాలా విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి. రథాలు, దేవతామూర్తుల విగ్రహాలు, మందిరాలు, దేవుళ్లని ఊరేగించేందుకు వివిధ వాహనాల నిర్మాణంలో నాణ్యమైన బస్తరు టేకునే వాడతాం. కర్ర నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడం. చాలా బ్యాలెన్స్ చేసుకుంటూ రథం నిర్మించాలి. నిర్మాణ సమయంలో చాలా నిష్ఠగా కూడా ఉండాలి.

– కొల్లాటి కామేశ్వరరావు, ప్రధాన శిల్పి



సత్యదేవుని పెద్ద రథంపై స్వామి, అమ్మవారి ఊరేగింపు (ఫైల్)

సత్యదేవుని చిన్నరథం



నిర్మాణ వ్యయం రూ.34 లక్షలు. రథం ఎత్తు 14 అడుగులు. వెడల్పు 6.3 అడుగులు. పొడవు 7.5 అడుగులు. ఈ రథం గత మార్చి రెండో తేదీ, రథసప్తమి నాడు లాంఛనంగా ప్రారంభించారు. ప్రతీ ఆదివారం రత్నగిరి ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవారిని ఊరేగిస్తున్నారు.

సత్యదేవుని పెద్ద రథం

నిర్మాణ వ్యయం రూ.1.08 కోట్లు. ఎత్తు 34 అడుగులు. వెడల్పు 14 అడుగులు. పొడవు 23.5 అడుగులు. గత మే నెలలో జరిగిన సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల ఐదో రోజు అనగా మే 22 వ తేదీన అన్నవర పుర వీధుల్లో ఈ రథంపై స్వామిని ఘనంగా ఊరేగించారు. చిన్న రథానికి రత్నగిరిపై ఆలయ ప్రాంగణంలో షెడ్డు నిర్మిస్తుండగా, పెద్ద రథానికి కొండ దిగువన షెడ్డు నిర్మిస్తున్నారు.

పడవల తయారీ నుంచి దేవుళ్ల రథాల వరకు...



మా తాత కొల్లాటి వీర్రాజు తొలుత చేపలు పట్టే బోట్లు, పడవలు తయారు చేసేవారు. అలా చిన్న చిన్న గృహోపకరణాలు, దేవతామూర్తుల విగ్రహాలు, రథాల తయారీ ప్రారంభించారు. మా నాన్న కొల్లాటి కామేశ్వరరావు పెద్ద పెద్ద రథాలు తయారు చేయడంలో నిపుణులు. ఆయన వద్ద నుంచి నేను ఈ వృత్తి నేర్చుకున్నాను. నాతో పాటు మరో 20 మంది శిల్పులు దేవతా రథాలు తయారు చేస్తున్నాం. ఇప్పటి వరకు 82 రథాలు తయారు చేశాం . వాటిలో 43 అడుగుల ఎత్తు కలిగిన అంతర్వేది దేవస్థానం రథం పెద్దది. ఆ తరువాత యానాంలోని మీసాల వేంకటేశ్వరస్వామి దేవస్థానం రథం ఎత్తు 38 అడుగులు. అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారికి సుమారు రూ.1.40 కోట్ల వ్యయంతో 14 అడుగుల ఎత్తు కలిగిన చిన్నరథం, 34 అడుగుల ఎత్తు కలిగిన పెద్ద రథం తయారు చేశాం. ఇవి కాకుండా పలు ప్రముఖ దేవస్థానాలకు రథాలు తయారు చేశాం. రథాలే కాకుండా చెక్కతో వివిధ దేవతామూర్తులు, ఇతర గృహోపకరణాలు కూడా తయారు చేశాం. నూతనంగా లోవకొత్తూరులో నిర్మించిన తలుపులమ్మ తల్లి ఆలయం తలుపులు కూడా మేమే తయారు చేశాం.

– కొల్లాటి శ్రీనివాస్



చెక్కతో తయారు చేసిన వేంకటేశ్వరస్వామి, సింహం, వినాయకుడి బొమ్మలు

హాస్టళ్లలో మెరుగైన వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్, పాల్గొన్న సంక్షేమశాఖ అధికారులు

అధికారులకు కలెక్టర్ నివాస్ సూచన

కాకినాడ సిటీ: జిల్లాలో సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల ప్రస్తుత పరిస్థితి, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, వసతి గృహాల్లో భోజనం, అల్పాహారం మెనూ, స్టడీ అవర్స్ నిర్వహణ, ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ నివాస్ జిల్లా సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించిన సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో సుమారు 33 ఎస్సీ, 41 బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయన్నారు. వసతి గృహాల్లో ఉన్న పిల్లల బాగోగుల బాధ్యత పూర్తిగా సంబంధింత వసతి గృహాలు అధికారులదేనని అన్నారు. తాను రెండేళ్ల పాటు వసతి గృహంలో ఉండి చదువుకున్నానని, సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. 2024–25 విద్యా సంవత్సరం తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో ఉన్న ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహం గదుల్లో విద్యుత్, ట్యూబ్‌లైట్లు, మరుగుదొడ్లలో పరిశుభ్రత, బాత్రూం డోర్లు, సక్రమమైన నీటి సరఫరా, తాగునీరు వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేకంగా బాలికల వసతి గృహాల్లోకి అపరిచిత వ్యక్తులు లోపలికి రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనుమతి లేకుండా పిల్లలు బయటికి రాకుండా చూడాలన్నారు. స్టడీ అవర్స్ సక్రమంగా నిర్వహించాలన్నారు. పదోతరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వసతి గృహాల్లో అమలు చేస్తున్న భోజనం, అల్పాహారం మెనూకి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ నివాస్ ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి స్థానిక పీహెచ్‌సీ వైద్య అధికారి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అధికారుల్లో ఉన్న నిర్లక్ష్య ధోరణి విడిచిపెట్టి, మంచి దృక్పథంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ డీపీ రమణమూర్తి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎం.లల్లి, జిల్లా సంక్షేమ వసతి గృహాల సమన్వయ అధికారి జి.వెంకటరావు, ఎస్సీ, బీసీ అసిస్టెంట్ సంక్షేమ అధికారులు, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

అవగాహనతోనే నివారణ



సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

తుని రూరల్: అవగాహన ద్వారానే సికిల్ సెల్ ఎనీమియా నివారించుకోవచ్చని ఆ విభాగం నిర్మూలన మిషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ప్రభాకర్ అన్నారు. బుధవారం వి.కొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి అధ్యక్షతన సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి అనువంశికంగా సంక్రమిస్తుందన్నారు. ఇది వారసత్వంగా తల్లిదండ్రుల నుంచి వచ్చే ఎర్ర రక్తకణాల రుగ్మత అన్నారు. దీని లక్షణాలను గుర్తించి చికిత్స చేయించుకోవాలన్నారు. రక్తహీనత, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన వొళ్లు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలసట, తరుచుగా అంటువ్యాధులు సోకడం, గర్భాధారణలో సమస్యలు, అవయవ వైఫల్యం లక్షణాలు కనిపిస్తాయన్నారు. వ్యాధి నిర్ధారణకు జీరో నుంచి 40 సంవత్సరాలు వయసు గల వ్యక్తులు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయశాంతి, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, నాయకులు సుర్ల లోవరాజు, యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, డాక్టర్లు పి.శాంతి, జి.నీరజ, వినోద్ పాల్గొన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి బుధవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వారం రోజులుగా సూర్యభగవానుడి ప్రతాపంతో భక్తులు అల్లాడిపోయారు. అయితే బుధవారం ఉదయం నుంచి వాతావరణం మేఘావృతమై ఉండడంతో భక్తులు కొంత ఊరట చెందారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు నాలుగు వేల మంది భక్తులు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం చేశారు.

నేడు స్వామి,అమ్మవార్ల నిజరూప దర్శనం

గురువారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు నిజరూపదర్శనం ఇవ్వనున్నారు. ప్రతి రోజు స్వర్ణాభరణాలు, పట్టు వస్త్రాలు ధరించి భక్తులకు దర్శనమిచ్చే స్వామి, అమ్మవార్లు గురువారం కేవలం పుష్పాలంకరణలో శిలారూపంగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రేపు

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో శుక్రవారం జెన్‌పాక్ట్ కంపెనీలో ప్రాసెస్ అసోసియేట్ కస్టమర్ సర్వీస్ (వాయిస్ ప్రాసెస్ ఇంగ్లిషు) ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు బుధవారం తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన 28 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి రూ.21 వేల జీతం, ఇన్సెంటివ్, పీజీ ఉత్తీర్ణులైన వారికి సంవత్సరానికి రూ.2.5 లక్షలు, ఇన్సెంటివ్స్, ఎక్స్‌పీరియన్స్ అభ్యర్థులకు సంవత్సరానికి రూ.3.5 లక్షలు, ఇన్సెంటివ్స్ ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఎంపికైన వారు నానక్‌రామ్‌గుడా, హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందన్నారు. వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.

12 వరకు 'నేను బడికి పోతా'

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో నేను బడికి పోతా, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, కాంపెయిన్ కార్యక్రమం అమలుపై లైన్ డిపార్టుమెంట్, జిల్లా సెక్టోరల్ అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ బుధవారం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో నిర్వహించారు. నేను బడికి పోతా, ఎన్‌రోల్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 13న ప్రారంభమైందని వచ్చే నెల 12వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం గ్రామీణ, ఆవాస ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఆరు సంవత్సరాల నిండి ఉన్న అర్హులైన పిల్లలందరినీ సమీప ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం నమోదు చేయాలన్నారు. 6–14 ఏళ్ల లోపు పిల్లలెవరూ బయట ఉండకూడదని, పాఠశాలల్లో మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రాప్ అవుట్ పిల్లలందరినీ తిరిగి పాఠశాలకు తీసుకురావడానికి సమావేశాలు, శిబిరాలు ఏర్పాటు చేసి కార్యక్రమాలను అమలు చేయాలని ఆదేశించారు. ఎన్‌రోల్‌మెంట్ అండ్ క్యాంపెయిన్‌ను ఎన్యుమేటర్లుగా సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, కేజీబీవీ సీఆర్‌టీలు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొని గ్రామాల్లో డోర్ టు డోర్ సందర్శనలు చేసి జీరో ఓఎస్‌సీ ఆవాస ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నారు. లైన్ డిపార్టుమెంట్ అధికారులు విద్యా శిబిరాల నిర్వహణ, విద్య ప్రాముఖ్యతపై పోస్టర్లను సిద్ధం చేసి విడుదల చేయడం, రాష్ట్ర, కేంద్రం అందించే సౌకర్యాలు, పథకాలపై అవగాహన కల్పించాలని రమేష్ సూచించారు. ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌మాస్టర్లు, స్కూల్ హెడ్ మాస్టర్లు విధిగా కార్యాచరణ ప్రణాళిక ద్వారా నేను బడికి పోతా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ప్రోగ్రామ్‌ను సందర్శించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి టి.ఆమని, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బుల్లిరాణి, జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కె.ప్రవీణ, మెప్మా పీడీ ప్రియంవద, ఉప విద్యాశాఖాధికారి కరినాయుడు వెంకటేశ్వరరావు, విద్యాశాఖాధికారులు వెంకటేశ్వరరావు, కె హరికృష్ణ, చామంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిలిచిన గ్రానైట్ పలకల తొలగింపు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో తూర్పు రాజగోపురానికి ఎదురుగా గల ఘాట్‌రోడ్ వద్ద మెట్లకు వేసిన గ్రానైట్ పలకలను తొలగించే పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ గ్రానైట్ పలకలు విరాళంగా అందచేసిన దాత మాజీ మంత్రి సిద్దా రాఘవరావు బంధువులు వీటి తొలగింపుపై ఆగ్రహం వ్యక్తం చేయడమే దీనికి కారణంగా చెబుతున్నారు. ఈ గ్రానైట్ పలకలు ఎండకు బాగా వేడెక్కిపోవడంతో ఈ మెట్ల మీద నడిచే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు వీటిని తొలగించే పని చేపట్టారు. అయితే ఈ విషయం తెలిసిన దాత దేవస్థానానికి విచ్చేసి ఈ పనులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు ముందుగా విషయం చెబితే ఈ గ్రానైట్ పలకలను తొలగించకుండా ప్రత్యామ్నాయం ఆలోచించేవారమని చెప్పినట్టు సమాచారం.



తాత్కాలికంగా నిలిచిపోయిన గ్రానైట్ పలకల తొలగింపు పనులు

క్లుప్తంగా

కడియపులంకలో భారీ చోరీ

కడియం: మండలంలోని కడియపులంకలో భారీ చోరీ జరిగింది. పది కాసుల బంగారం, వెండి వస్తువులతో పాటు, లక్ష రూపాయల నగదు కూడా మాయమైంది. ఘటనకు సంబంధించి కడియం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడియపులంకకు చెందిన కర్రి వెంకటేశ్వరరావు ఇంటి తాళాలు పగులగొట్టి బెడ్‌రూమ్‌లోని బీరువాలో ఉన్న పది కాసుల బంగారం, వెండి, లక్ష రూపాయల నగదును దోచుకువెళ్లారు. వేంకటేశ్వరరావు తన ఇంటికి సమీపంలోనే ఉన్న అత్తవారింటికి మంగళవారం రాత్రి వెళ్లి వచ్చేసరికి ఈ ఘటన జరిగింది. చోరీ జరిగిన విషయం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి. తులసీధర్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరకుని బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బాధితులను పరామర్శించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిగా పోలీసులను ఆదేశించారు.

దళితులకు రెండు పదవులేనా!

అమలాపురం రూరల్: కూటమి మంత్రివర్గంలో దళితులకు కేవలం రెండు పదవులతో సరిపెట్టడం తగదని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాలలకు, మాదిగలకు రెండేసి చొప్పున హోం మంత్రితో సహా నాలుగు మంత్రి పదవులు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. నడిపూడిలో నడిపూడి జగ్జీవన్ రామ్ భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోటిమంది దళితులు ఉన్నారని, ఆ మేరకు పదవులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు దళితులకు చెందిన 27 పథకాలను పునరిద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు కాప నాగభూషణం, చాట్ల సత్యనారాయణ, తొత్తరమూడి ప్రభాకరరావు, మందా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపల చోరీపై ఫిర్యాదు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం గ్రామంలోని వీరయ్య చెరువులో చేపల చోరీపై కసు నమోదు చేసినట్టు ఎస్సై కె.నాగరాజు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పంచాయతీ పరిధిలో ఉన్న వీరయ్యచెరువులో 2021వ సంవత్సరంలో చేపలు పెంచుకోడానికి వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన దిబ్బ శ్రీను హెచ్చుపాటకు తీసుకున్నాడు. ఇటీవల చెరువులో పంచాయతీ పరిధిలోని కొత్తూరుకు చెందిన మరిడిరాజు, గంగరాజు, సురేష్ అక్రమంగా చేపలు పట్టుకున్నారని పాటదారుడు కార్యదర్శికి ఫిర్యాదు చేశాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సిరులు వెదజల్లు


పెదపళ్లలో వెదజల్లు విధానంలో చేపట్టిన సాగులో మొలకెత్తిన విత్తనాలు

- ఈ పద్ధతిపై అన్నదాతల ఆసక్తి
- పెట్టుబడి ఆదాతో పాటు అధిక దిగుబడి
- డ్రమ్ సీడర్ పద్ధతితో మరింత మేలు

అలమూరు: గత రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమంపై అనుసరించిన పారదర్శక విధానాలతో వ్యవసాయ రంగం వేగంగా అభివృద్ధి చెందింది. అధునాతన, పురాతన పద్ధతులను మేళవింపు ద్వారా రైతులు పెట్టుబడిని నియంత్రించుకుని అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో పాటు సరైన గిట్టుబాటు ధర లభించడంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్నారు.

పెరిగిన ఎరువుల ధరలు, కూలీల కొరత వల్ల పెట్టుబడి తగ్గించేందుకు వారంతా వెదజల్లు సాగు చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాల్లో 1,68,780 ఎకరాల్లో 96572 మంది రైతులు వరిసాగు చేపట్టారు. ఈ సాగులో 73 శాతం మేర స్వర్ణ రకం సాగు చేస్తుండగా 21 శాతం మంది ఎంటీయూ 1318, ఆరు శాతం మంది 1064 రకాన్ని సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో 33 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేయగా రైతుల నుంచి సుమారు మూడు వేల క్వింటాళ్ల సేకరణ ఇప్పటికే జరిగింది. అలాగే ప్రస్తుతం వివిధ గ్రామాల్లో 900 క్వింటాళ్ల విత్తనాలు ఆర్‌బీకేల్లో నిల్వచేయగా మిగిలిన విత్తనాలను వ్యవసాయశాఖ సరఫరా చేసింది.

ఈ సీజన్‌లో సుమారు 80 శాతం మేర వెదజల్లు సాగునే ఎంచుకోగా మిగిలిన రైతులు నాటే పద్ధతిని అవలంబిస్తున్నారు. సాగునీటి ఎద్దడి దష్ట్యా వ్యవసాయ శాఖ సూచనలతో ఈ నెలాఖరుకు నాట్లు పూర్తి చేయాలని రైతులు సమాయత్తమవుతున్నారు. అధికారులు సైతం వెదజల్లు సాగే మేలని సూచిస్తుండడం గమనార్హం.

కలుపు యాజమాన్యం ఇలా..

రబీ తొలిదశలో నీరు నిలగట్టక ఆరుతడిగా సాగు చేయడం వల్ల కలుపు సమస్యను అధిగమించవచ్చు. అందువల్ల ఈ పద్ధతిలో కలుపు మందును తప్పనిసరిగా వాడాలి. ఎకరాకు 35 గ్రాముల ఆక్సాడయార్జిల్ లేదా ప్రెటిలాక్లోర్ మందును ఎకరాకు 400 మిల్లీ లీటర్లు లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 100 గ్రాముల మందును 20 కిలోల పొడి ఇసుకలో కలపాలి. ఈ మందును వెదజల్లు విధానంలో విత్తిన 3–5 రోజుల్లో పొలంలో పలుచగా నీరు పెట్టి కలుపు మందు పిచికారీ చేయాలి. ఆ తరువాత పొలంలో నీరు తీసి వేయడం ద్వారా కలుపును నివారించవచ్చు. రెండో దశ నుంచి పొలంలో ఏర్పడిన కలుపును మొక్కల మధ్య తొక్కడం ద్వారా ఎరువుగా మలుచుకోవచ్చు.

నీటి యాజమాన్యం..

విత్తనం వేసినప్పటి నుంచి పొట్ట దశ వచ్చే వరకూ

పాడి-పంట

పొలంలో నీరు నిల్వ ఉండకుండా కేవలం బురదగా మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎక్కువైన నీటిని బయటకు పోవడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. దీని వల్ల వరి కంకి వేర్లు ఆరోగ్యవంతంగా పెరిగి ఎక్కువ పిలకలు పెట్టే అవకాశం ఉంటుంది. పైరు పొట్ట దశ నుంచి పంట కోసే పది రోజుల ముందు రెండు సెంటీమీటర్ల నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి.

డ్రమ్ సీడర్ పద్ధతిలో..

దమ్ము చేసిన అనంతరం చదును చేసిన భూమిలో పలుచటి నీటి పొర ఉండేలా చూసుకుని మడి కట్టిన విత్తనాన్ని చల్లాలి. డ్రమ్ సీడర్ పరికరానికి నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ములు ఉంటాయి. ప్రతి డ్రమ్ముకు 20 సెంటీ మీటర్ల దూరంలో రెండు చివర్ల వరుసకు 18 రంధ్రాలుంటాయి. ఈ డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూతను బిగించాలి. గింజలు నింపిన డ్రమ్ సీడర్‌ను లాగితే ఎనిమిది వరుసల్లో 20 సెంటీ మీటర్ల దూరంలో గింజలు పడతాయి. దీంతో వరుసల్లో కుదురు కుదురుకు మధ్య దూరం 5–8 సెంటీ మీటర్ల దూరం ఉంటుంది. ప్రతి 16 వరుసలకు అడుగు వెడల్పులో కాలిబాటలు వేసుకోవాలి. తాడు లాగి డ్రమ్ వాడితే వరుసలు బాగా వచ్చి విత్తు సక్రమంగా జరుగుతుంది.

కనీస జాగ్రత్తలు పాటించాలి



- వెదజల్లు విధానంలో సాగు చేసే రైతులు విత్తనాలను 24 గంటల పాటు నానబెట్టాలి.
- మరుసటి రోజు ఆ విత్తనాలను గోనె సంచె కప్పి నిల్వ ఉంచాలి.
- విత్తనం ముక్కు పగిలి తెల్లగా మోసు వచ్చే క్రమంలో పొలంలో విత్తనాలను వెదజల్లాలి.
- విత్తనాలకు మొక్కలు వచ్చే వరకూ పొలంలో నీరు లేకుండా కాలువలు ఏర్పాటు చేసుకుని బయటకు పంపాలి.
- వారం రోజుల తరువాత ఒకసారి పంటకు సాగునీటిని అందజేసి మరుసటి రోజు తొలగించాలి.
- దమ్ము చేసే సమయంలో పొలంలో ఎగుడు దిగుడులు లేకుండా నేలను సమాంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- ఎకరానికి 16 నుంచి 20 కిలోల విత్తనాలను నాటాలి. వరినాట్లు నాటే 15 రోజుల ముందు ఒకసారి చేనుకు దమ్ము చేయాలి.
- నాలుగు రోజులు ముందుగా చదును చేయాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలువలను ఏర్పాటు చేయాలి.
- కలుపు నివారణకు బింతియోకార్బ్ లేదా అనిలోఫాస్ 1.25 లీటర్ల మందును 27 కిలోల ఇసుకలో కలిపి చల్లితే కలుపును నివారించవచ్చు.

– ఓలేటి బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి

ఎన్నో ఉపయోగాలు

- తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి కూలీల కొరతను అధిగమించవచ్చు.
- సాగునీటి ఎద్దడిని అధిగమించవచ్చు.
- పంట పది రోజుల ముందే కోతకు వస్తుంది. భూమి సారవంతంగా మారుతుంది.
- మొక్కలో సాంద్రత పెరిగి పది శాతం మేర అధిక దిగుబడికి అవకాశం ఏర్పడుతుంది.
- సాధారణ సాగులో ఎకరం వరి నారుమడికి 30 కేజీల విత్తనాలు అవసరమవుతాయి.
- వెదజల్లు పద్ధతిలో కేవలం 12 నుంచి 18 కేజీలు మాత్రమే అవసరమవుతాయి.
- సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా కలుపు మొక్కలను సైతం ఎరువుగా మలుచుకోవచ్చు.
- నారుమడులు పోసి ఊడ్చేందుకు పట్టే ఎక్కువ సమయాన్ని వెదజల్లు సాగుతో అరికట్టవచ్చు. దీని వల్ల సుమారు రూ.3 వేలు ఆదా అవుతుంది.
- ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట కాలం కోల్పోకుండా నీరు అందుబాటులో ఉన్నప్పుడే వరిసాగు చేసుకునే అవకాశం ఉంటుంది.


పినపళ్లలో వెదజల్లు సాగుతో చేపట్టిన పొలంలో విత్తనాలు చల్లుతున్న రైతులు

కువైట్ బాధితులకు క్షమాభిక్ష

- ఈ నెల 30వ తేదీ తుది గడువు
- అక్కడి పోలీసు స్టేషన్లు, దౌత్య కార్యాలయాల్లో సంప్రదించాలి
- ప్రకటన విడుదల చేసిన ఎమ్మెల్సీ కుడుపూడి


సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: సరైన ఆధారాలు, అనుమతులు లేకుండా కువైట్ దేశంలో చిక్కుకుపోయిన తెలుగువారు అక్కడి పోలీసు స్టేషన్లు, లేదా భారత దౌత్య కార్యాలయంలో ఈ నెల 30వ తేదీలోగా సంప్రదిస్తే స్వదేశానికి చేరుకోవచ్చని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ హౌస్ మెయిడ్స్ ఇన్ గల్ఫ్ కంట్రీస్ అండ్ ద వరల్డ్ ఫ్రమ్ గోదావరి డెల్టా రీజియన్ చైర్మన్ హోదాలో ఆయన బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. స్వదేశానికి వచ్చే దారిలేని వారికోసం కువైట్ దేశపు రాజు క్షమాభిక్ష ప్రకటించారని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని వారి కుటుంబీకులు, బంధువులు ఫోన్లు చేసినప్పుడు ఈ విషయం చెప్పాలని కుడుపూడి పేర్కొన్నారు. వాస్తవానికి మార్చి 17వ తేదీ నుంచి జూన్ 17 లోపున అక్రమ వలసదారులు నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చని క్షమాభిక్షలో పేర్కొన్నప్పటికీ, గడువు పెంచాలని ఆ రాజ కుటుంబంలోని అడ్వకేట్, కువైట్ రాజకుమారి (షెయికా బీబీ అల్సబా)కు విజ్ఞప్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆ గడువును ఈనెల 30వ తేదీ వరకూ పొడిగించారు. అక్కడి వారు ఇరు తెలుగు రాష్ట్రాలలోని బంధువులకు ఫోన్ చేసినపుడు ఈ క్షమాభిక్ష గురించి చెప్పాలని కుడుపూడి తన ప్రకటనలో పేర్కొన్నారు. లేని పక్షంలో అమలాపురానికి చెందిన సామాజిక కార్యకర్త బాబీ గాబ్రియల్‌ను 7013210153 ఫోన్ నెంబరులో సంప్రదించాలని పేర్కొంది.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం


రైలు ఢీకొనడంతో మృతిచెందిన గుర్తు తెలియని వృద్ధుడు

రాజమహేంద్రవరం సిటీ: రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని 65 నుంచి 70 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడని జీఆర్పీ ఎస్సై మావుళ్లు బుధవారం తెలిపారు. మృతుడు తెలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ షర్ట్, నీలం, గోధుమ, నలుపు రంగు లుంగీ, సోనాటా వాచ్, రాజమహేంద్రవరం నుంచి ఐఎల్‌టీడీ వరకూ ఆర్టీసీ బస్సు టికెట్ లభ్యమయ్యాయన్నారు. రైల్వే స్టేషన్ దగ్గరలో రైల్వే కళ్యాణమండపం ఎదురుగా రైల్వే ట్రాక్ మీద జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


కరణం వెంకటేశులు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో ఉపాధిహామీ కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల ప్రకారం గ్రామంలో నరసింహం చెరువులో బుధవారం ఉదయం గ్రామానికి చెందిన కరణం వెంకటేశులు(50) పని చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ కాకర దుర్గారావు, తోటి కూలీలు అతన్ని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిత

ఉమ్మడి రాష్ట్రాల ఎన్‌సీసీ డీజీపీ ఎయిర్ కమాండర్ రెడ్డి


ఐడీఎస్ఎస్‌సీ 2024కి ఎంపికైన క్యాడెట్లతో డీజీపీ రెడ్డి

పెద్దాపురం: ఎన్‌సీసీ ద్వారా ప్రతి విద్యార్థి మెరుగైన భవిష్యత్ సాధించవచ్చని ఏపీ, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల ఎన్‌సీసీ డీజీపీ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అన్నారు. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో బుధవారం ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ కాంపిటేషన్స్ (ఐడిఎస్ఎస్‌సీ 2024)కు ఎంపికైన క్యాడెట్లను ఆయన కలుసుకున్నారు. పెద్దాపురంలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంప్‌లో ఐడీఎస్ఎస్‌సీ క్యాంపులో పాల్గొనడానికి అవసరమైన షూటింగ్ ఈవెంట్లను ఆయన పరిశీలించారు. ఎన్‌సీసీ శిక్షణ భవితకు ఎంతో తోడ్పడుతుందన్నారు. క్యాడెట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూలై రెండవ తేదీ నుంచి 24వ తేదీ వరకు తిరుచిరాపల్లిలో ఐడీఎస్ఎస్ 2024 క్యాంపు నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్ని ఈవెంట్లలో క్యాడెట్లు పతకాలు సాధించి మంచి కీర్తి, ప్రతిష్టలు తీసుకు రావాలని రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం

- బాలబాలాజీకి వసంతోత్సవం
- నదీ స్నానంతో పులకించిన భక్తులు


సుదర్శన పెరుమాళ్‌కు శ్రీచక్రస్నానం చేయిస్తున్న రుత్విక్‌లు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం వైనతేయ గోదావరి నదిలో శ్రీవారి చక్రస్నానం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల గోవింద నామ స్మరణలు, వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ సుదర్శన పెరుమాళ్‌కు గోదావరి నదిలో పుణ్యస్నానం చేయించారు. గ్రహ దోషాలు, అపమృత్యు దోషాలను నివారించే స్వామిగా ప్రాచుర్యం పొందిన సుదర్శన పెరుమాళ్‌తో పాటు భక్తులు గోవింద నామ స్మరణతో గోదావరి నదిలో తలారాస్నానం చేసి పునీతులయ్యారు. చక్రస్నానం ఆద్యంతం వైభవోపేతంగా నిర్వహించారు. దేవస్థానం ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో ఉభయ దేవేరులతో కొలువు తీరిన శ్రీవారికి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు వసంతాలు చల్లుకుంటూ అత్యంత భక్తి శ్రద్ధలతో వసంతోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారితో పాటు సుదర్శన పెరుమాళ్‌కు నదీతీరంలో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం చక్రస్నానం జరిపించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపారు. శ్రీవారికి సహస్రనామార్చన, బాల భోగం నివేదన, వేదపారాయణ, నిత్యహోమం, పూర్ణాహుతి, బలిహరణ, ధ్వజావరోహణం, మంగళాశాసనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, దేవస్థానం ఉద్యోగులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


బాలబాలాజీ స్వామితో పాటు సుదర్శన పెరుమాళ్‌కు జలాభిషేకం చేస్తున్న అర్చకులు

అలవికాని హామీలతో అధికారం

మాజీ మంత్రి గొల్లపల్లి, మాజీ ఎమ్మెల్యే రాపాక


పార్టీ నాయకులతో సమావేశమైన మాజీ మంత్రి గొల్లపల్లి, మాజీ ఎమ్మెల్యే రాపాక

రాజోలు: అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను తాత్కాలిక భ్రమల్లో ఉంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం తాటిపాకలోని గొల్లపల్లి నివాసం వద్ద గొల్లపల్లి అధ్యక్షతన మండల పార్టీ అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. గొల్లపల్లి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, పార్టీ కార్యకర్తలు అధైర్య పడవద్దని అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలను పాటిస్తూ ప్రజల పక్షాన నిలవాలన్నారు. రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వస్తారన్నారు. విజేతలుగా నిలిచిన వారు కక్షపూరితంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల పార్టీ అధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, అడబాల బ్రహ్మాజీ, కుసుమ చంద్రశేఖరరావు, బొలిశెట్టి భగవాన్, జెడ్పీటీసీ మట్టా శైలజ తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతోనే భార్య హత్య


నిందితుడు నరసింహమూర్తిని ప్రవేశపెట్టి హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, పోలీసులు

వాకలపూడి హార్బర్‌పేటలో భర్త అరెస్టు

కాకినాడ రూరల్: మండలం వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌లో ఈనెల 16వ తేదీ తెల్లవారు జామున జరిగిన ఓలేటి సీతమ్మ (26)హత్య కేసును పోలీసులు ఛేదించారు. భర్త నరసింహమూర్తే ఆమెను కడతేర్చినట్టు పోలీసులు గుర్తించారు. సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హత్య కేసు వివరాలను బుధవారం మీడియాకు వివరించారు. ఈ నెల 16న తెల్లవారు జామున ఓలేటి సీతమ్మ ముఖంపై బలమైన గాయాలతో హత్యకు గురైందని, విచారణలో భర్త నరసింహమూర్తి హంతకుడుగా తేలడంతో బుధవారం అరెస్టు చేసి జుడీషియల్ రిమాండ్ నిమిత్తం స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచామన్నారు. సీతమ్మపై ఉన్న విపరీతమైన అనుమానంతో వివాహేతర సంబంధం అంటకట్టి వేధించేవాడని, ఇటీవలి ఎన్నికల్లో ఓ పార్టీపై పందెం వేసి ఓడిపోయి రూ.3.5 లక్షలు సమకూర్చేందుకు బంగారు వస్తువులు ఇవ్వమని ఇబ్బంది పెట్టాడన్నారు. ఈ నేపథ్యంలోనే రాయితో తలపై మోదడంతో సీతమ్మ మృతి చెందిందని, ఉదయం మృతురాలి తల్లికి ఫోన్ చేసి మీ అమ్మాయిని ఎవరో చంపి బంగారు వస్తువులు పట్టుకుపోయాడని సమాచారం ఇచ్చాడు. అల్లుడిపై అనుమానం ఉన్న సీతమ్మ తల్లి సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, డీఎస్పీ హనుమంతరావు, పర్యవేక్షణలో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సీఐ సన్యాసిరావు, పోర్టు సీఐ సుమంత్ దర్యాప్తు చేసి నిందితుడు నరసింహమూర్తిని అరెస్టు చేసి అతడి నుంచి బంగారు వస్తువులు, హత్యకు వినియోగించిన రక్తపు మరకలుతో ఉన్న రాయిని స్వాధీనం చేసుకున్నారు.

శాటిలైట్‌సిటీలో వ్యక్తి హత్య

పాత కక్షలే కారణం


మృతుడు నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: అష్టాచమ్మ ఆటలో వివాదంతో పాటు, పాతకక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన శాటిలైట్‌సిటీ గ్రామం రాజీవ్‌గృహకల్ప సముదాయంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం శాటిలైట్‌సిటీ రాజీవ్‌గృహకల్ప సముదాయానికి చెందిన మార్గాని నాగేశ్వరరావు (45) కూలి పని చేసుకుంటాడు. అదే ప్రాంతానికి చెందిన కైరం వెంకన్న, కైరం వీరన్నలకు నాగేశ్వరరావుతో పాతకక్షలు ఉన్నాయి. మంగళవారం వారు గృహకల్ప వద్ద అష్టాచమ్మ ఆడుతున్నారు. ఈ సందర్భంగా పాత అప్పు కోసం వారి మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో వెంకన్న, వీరన్నలను చంపేస్తానని నాగేశ్వరరావు కత్తి పట్టుకుని తిరిగాడు. బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో వారి మధ్య గొడవ జరిగి వెంకన్న భార్య విషయమై నాగేశ్వరరావు అమర్యాదగా మాట్లాడాడు. దీంతో నాగేశ్వరరావు వద్ద ఉన్న కత్తిని వెంకన్న లాక్కుని అతనిని పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేశ్వరరావు సోదరుడు వీర్రాజు ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేయగా, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ శివగణేష్ దర్యాప్తు చేస్తున్నారు.